# మనం

## కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

శనివారం | 11 | మార్చి | 2023 | పేజీలు : 6




### కాంగ్రెస్ పార్టీ నాయకులవి మతి భ్రమించిన మాటలు

గంగులకు చార్జిషీటు కాదు..

ఆయన చేసిన అభివృద్ధికి

అవార్డునివ్వాలి

కరీంనగర్ మేయర్

సునీల్ రావు



5 లో

# గ్రామాలలో రాజమేలుతున్న బెల్ట్ షాపులు







- బెల్టు షాపులతో బెంబేలెత్తుతున్న జనం
- వీధి వీధికో బెల్టు షాప్
- వేకువజాముననే మద్యం కోడైకూస్తుంది
- ముత్తలో మునుగుతున్న యువత

మంథని,మార్చి 10 మనం న్యూస్ : మంథని పట్టణ ప్రాంతంతో పాటు గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతుంది. చాప కింద నీరు వలే యువత భవిష్యత్తు మత్తులోకి వెళుతుంది. వీధి వీధికో బెల్ట్ షాపు ఏర్పాటు చేయడంతో భవిష్యత్తు భావి యువత జీవితం అంధకారంలోకి వెళ్తుంది. పోటీపడి మరి బెల్ షాపులు ప్రారంభించడం జరుగుతుంది. గ్రామాల్లో బహిరంగంగా వేలంపాట ద్వారా బెల్ట్ షాపులు చేజిక్కించుకున్న బెల్ట్ షాపుల యజమానులు మధ్యం ప్రియుల నుండి అందింన కాడికి దోచుకుంటున్నారు. బెల్ట్ షాపులలో అధిక ధరకు మద్యం అమ్మడం,వంటి కార్యక్రమాలు గ్రామీణంలో కోకోల్లలుగా జరుగుతున్నప్పటికి పట్టించుకునే నాధుడే కరువయ్యాడు.బెల్ట్ షాపులపై కొరడా జూలుపించాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంలో గ్రామాలలో బెల్ట్ షాపులు రాజ్యమేలుతున్నాయి. అధిక ధరకు మద్యం విక్రయించడం ద్వారా అప్పుచేసి మరి యువత మద్యం కొనుగోలు చేయడం ద్వారా,యువత మానసికంగా ఆర్థికంగా చాలా ఇబ్బందుల పాలవుతున్నారు. పొద్దు మాపు,పగలు,రాత్రి అనే తేడా లేకుండా 24 గంటలు బెల్ట్ షాపులు నడవడం వల్ల బెల్టు షాపులలో మద్యం లభిచడంతో మిగతా 2లో..

## కంటి వెలుగును

# సద్వినియోగం చేసుకోవాలి

### కళాశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాలి

### కరీంనగర్ కలెక్టర్ కర్ణన్

తిమ్మాపూర్, మార్చి 10 (మనం న్యూస్)ః కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని దృష్టిలోపాలను దూరం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం అల్గునూరుతో పాటు కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎవరు కూడా దృష్టిలోప సమస్యలతో బాధపడకుండా ఉండాలనే సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటివెలుగు శిబిరాలకు వచ్చే వయోవృద్దులకు మొదట పరీక్షలను నిర్వహించాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది కూడా పరీక్షలను నిర్వహించుకోవాలని సూచించారు. చుట్టుపక్కల ఉన్నవారికి శిబిరం ఏర్పాటు గురించి తెలియజేయాలన్నారు. అంతకుముందు ఎల్ ఎండి కాలనీలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జువేరియా, తహసీల్దార్లు కనకయ్య, సుధాకర్, అల్గునూర్ కార్పొరేటర్ శారద రవీందర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రం ప్రారంభం



చిగురుమామిడి-మార్చి10 మనంన్యూస్: చిగురుమామిడి మండల కేంద్రంలో జేఎస్ఆర్ అన్న చలివేంద్రాన్ని బీజేపినాయకులు బొమ్మ శ్రీరామ్, మండల అధ్యక్షుడు దుడ్డెల లక్ష్మినారాయణ గ్రామానికి చెందిన నాగెల్లి కారుణాకర్‌రెడ్డితో కలిసి శుక్రవారం నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా జేఎస్ఆర్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బాటసారులు, ప్రయాణీకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీటిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్‌ల పంపిణీ



గంభీరావుపేట, మార్చి 10 (మనం న్యూస్): గంభీరావుపేట మండలంలోని మహిళా సంఘాల గ్రూపులకు ప్రభుత్వం విడుదల చేసిన వడ్డీ లేని రుణాల ప్రొసీడింగులను శుక్రవారం ఆయా మహిళా సంఘాల గ్రూప్ వివోలకు అందజేశారు. మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపి వంగ కరుణ, జడ్పిటిసి కొమిరిశెట్టి విజయ, తహసిల్దార్ మధుసూధన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రొసీడింగ్ లను పంపిణీ చేశారు. మండలంలోని 979 మహిళా సంఘాలు, 44 వివో ల పరిధిలో 2 కోట్ల 35 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాల నిధులు మంజూరైనట్లు తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అనంతరం సావిత్రిబాయి పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు రజిత, వైస్ ఎంపీపీ లతలతో పాటు పలు మహిళా సంఘాల వివో లు తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాలలో రాజమేలుతున్నా

# బెల్ట్ షాపులు

మొదటి పేజీ తరువాయి..

గ్రామాలలో వేకువ జాముననే మద్యం కోడై కూస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేలుకొని బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాల్సిందిగా సగటు యువత కోరుతుంది. మంథని పట్టణంలోని పలు మద్యం షాపుల్లో కల్తీ మద్యం విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా మద్యం వ్యాపారులు ఎమ్మార్పీ ధరకు మద్యం విక్రయించకుండా అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి నకిలీ మద్యం విక్కి విక్రయాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### విజయవంతమైన విద్యుత్

## సమస్యల పరిష్కార వేదిక



గంభీరావుపేట, మార్చి 10 (మనం న్యూస్): గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక విజయవంతమైంది. సిజిఆర్ఎఫ్ ఛైర్మన్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సెస్ పరిధిలోని గంభీరావుపేట , ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాలకు సంబంధించిన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో లూప్ లైన్స్ మిడిల్ పోల్స్ అవసరం ఉన్నట్లు పలువురు వినియోగదారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దాదాపు 33 పైబడి మిడిల్ పోల్స్ పై ఫిర్యాదులు చేశారు. వినియోగదారులు చేసిన ఫిర్యాదులను త్వరలోనే పరిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెస్ ఎండి రామకృష్ణ, టెక్నికల్ సభ్యులు అశోక్, ఫైనాన్స్ సభ్యులు కిషన్, ఫోర్త్ మెంబర్ భూమారెడ్డి, సెస్ డైరెక్టర్ గౌరనేని నారాయణరావు, సెస్ డిఇ ఈశ్వర్ ప్రసాద్, ఏడిఈ లక్ష్మణ్, ఏఈ సిద్ధార్థలతోపాటు సెస్ సిబ్బంది, పలు మండలాల వినియోదారులు పాల్గొన్నారు.

## సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్



రాజన్న సిరిసిల్ల, మార్చి 10 (మనం న్యూస్): సిరిసిల్ల పట్టణంలోని గీతా నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫర్మ్ ఆధ్వర్యంలో నిర్వహించిన డిస్టిక్ లెవెల్ బయలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్-2023ను మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, జిల్లా గ్రంథాలయ శాఖ అధ్యక్షులు ఆకునూరి శంకరయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన జాతీయస్థాయిలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పాఠశాలలు, కళాశాలలు మొదలగు విజ్ఞాన కేంద్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా గీతా నగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలంగాణ బయలాజికల్ సైన్స్ ఫార్మ్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా స్థాయి బయలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ 2023 ను నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం కోసం ఇలాంటి టాలెంట్ టెస్ట్ లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఉపాధ్యాయుల ద్వారా విజ్ఞాన పుస్తకాల నుండి మంచి జ్ఞానాన్ని పొంది భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడేలా విద్యార్థులు పరిశోధనలు చేసి తద్వారా మన ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలనె మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకొని సృజనాత్మకతతో తమ చదువులు సాగించాలని సూచించారు. విద్యార్థులు మంచి ఆదర్శవంతమైన ప్రవర్తనతో ఉన్నత విద్యనభ్యసించి ఈప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. మానవుడు ఆరోగ్యంగా జీవించాలంటే బయలాజికల్ సైన్స్ పాత్ర ఎంతో ముఖ్యమైందని అలాంటి బయోలాజికల్ సైన్స్ పై చిన్న వయసులోనే మక్కువ ఏర్పరచుకోవాలన్నారు. అనంతరం జిల్లాస్థాయి బయలాజికల్ సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేసి విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ డైరెక్టర్ వీరబత్తిని కమలాకర్, జిల్లా సైన్స్ విజ్ఞాన అధికారి దేవయ్య, విజయనగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, సెక్రెటరీ అంజి రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యరేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం



కొత్తపల్లి, మార్చి 10 (మనం న్యూస్): కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ గ్రామంలో రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి ఎంపిపి పిల్లి శ్రీలత మహేష్ హాజరై అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ ఎంపిటిసి సభ్యులు పండుగ గంగవ్వ నర్సయ్య, గౌడ సంఘం అధ్యక్షులు కాసారపు గణేష్ గౌడ్, కొత్తపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, వేణు గౌడ్, సతీష్ గౌడ్ ,రామకృష్ణ గౌడ్ గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

# జోష్ నింపిన అల్ఫోర్స్ బ్లిస్ వార్షికోత్సవం




కరీంనగర్, మార్చి 10 (మనం న్యూస్): జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లి అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్ట్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన బ్లీస్ పాఠశాల వార్షికోత్సవం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకుల్లో జోష్‌ను తెప్పించాయి. అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి, 40వ డివిజన్ కార్పొరేటర్ కోటగిరి భూమాగౌడ్‌లు కలిసి సంప్రదాయ బద్ధంగా వేదమంత్రోచ్చారణల మధ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్నిరకాలుగా అన్ని అంశాలలో పటిష్టంగా ఉండాలని , సమాజంలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా వ్యవహరించి





ముందుకు కొనసాగాలని సూచించారు. ప్రతి విద్యార్థి చిన్నతనం నుండే మేథాశక్తిని పెంచుకునే ప్రక్రియలో నిమగ్నమై ఇతరులతో పోటీపడి వారిలో ఉన్న సద్గుణాలను నేర్చుకుని ఆదర్శవంతంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పురాతన కాలంలో గురుకులాల ద్వారా విద్యార్థులకు పలు అంశాలపట్ల అవగాహన కల్పించడమే కాకుండా నైతిక విలువలను క్రమశిక్షణను నేర్పించి వారిని సమాజంలో ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దాలని చెప్పారు. పాఠశాలలో విషయాలతో పాటు సమాజంలో వ్యవహరించే తీరును కూడా ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవడంతో పాటు ఉపాధ్యాయులు నిర్దేశించిన మార్గాలను తూచ తప్పకుండా పాటించి లక్ష్యాల వైపు అడుగులు వేయాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఆసక్తికరమైన రంగంలో ప్రోత్సాహం అందించడంతో పాటు వారికి ఒత్తిడినుండి ఉపశమనం కల్గించడానికై పలు వినోద కార్యక్రమాలలో పాల్గొనేలా ప్రోత్సహిస్తే వారి సర్వతో ముఖాభివృద్ధికై పరోక్షంగా చేయూతనిచ్చిన వారవుతారని చెప్పారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన 'ట్వింకిల్ ... టాట్స్ ట్వింకిల్', 'ఓమై బటరై - అయామ్ వితు', 'హమారా దేశ ధర్త్' నృత్యాలు ఆకర్షణీయంగా నిలిచాయి. ప్రత్యేకంగా విద్యార్థులు ప్రదర్శించిన 'అయామ్ హెల్తీ యు ఆర్ జంక్' నాటిక ఆలోచింపజేసింది. సుమారు 200 మంది విద్యార్థులు వివిధ పండ్లు, పూలు, రాష్ట్రాల సాంప్రదాయాలు దుస్తులతో విచ్చేసి వేడుకకు మరింత వన్నె తెచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు , విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతు సమస్యలను పరిష్కరించాలని

# బీజేపీ నిరసన దీక్ష



కరీంనగర్, మార్చి 10 (మనం న్యూస్): రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్ రూరల్ బిజెపి కిసాన్ మోర్చా మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల పెల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు వ్యతిరేక కెసిఆర్ ప్రభుత్వం రాజ్యమేలుతుందని విమర్శించారు. రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతుంటే పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉండి చోద్యం చూస్తుందన్నారు. బిఆర్ఎస్ ఎన్నికల హామీ రైతు రుణమాఫీ నేటికీ చేయలేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏకకాలంలో లక్ష రూపాయల రుణాలను వడ్డీతో సహా మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ధరణి అనేక భూ సమస్యలకు నిలయంగా మారిందని, ముఖ్యంగా రైతాంగం దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ధరణి వల్ల అపరిష్కృతంగా మారిన రైతుల భూమి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 24 గంటల విద్యుత్ హామీని కెసిఆర్ ప్రభుత్వం నిలబెట్టుకోలేకపోయిందని, నేడు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిపారు. సింగల్ ఫేస్ కరెంటుతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, పంటలు చేతికొచ్చే సమయంలో సమయపాలన లేని విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే రైతాంగానికి 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని , పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో , అనుకోని పరిస్థితుల్లో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకోవాల్సిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. కెసిఆర్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే రాష్ట్రంలో ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతుల సమస్యల ను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ సహకార సంఘం రాష్ట్ర కన్వీనర్ మోతే గంగారెడ్డి, ఉప్పల రఘు , కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దాసరి రమణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు గుర్రం కమలాకర్ రెడ్డి ,పంది శ్రీనివాస్ యాదవ్ ,ఈస్ట్ జోన్ అధ్యక్షులు కోటేష్, బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగంటి కుమార్, పాశం తిరుపతి, కూకట్ల రమేష్, పునేందర్ యాదవ్, పేరం మహేష్, శంకరన్న రాజకుమార్, సంజీవ్, గాదె వేణుమాధవ్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీని తక్షణమే అమలు చేయాలి

### బిజెపి జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ రావు



మెట్ పల్లి మార్చి, 10 (మనం న్యూస్) : ఎన్నికల సమయంలో కెసిఆర్ హామీ ఇచ్చిన మేరకు లక్ష రూపాయల రుణమాఫీని వడ్డీతో సహా వెంటనే నెరవేర్చాలని బిజెపి జిల్లా అధ్యక్షులు పైడిపెల్లి సత్యనారాయణ రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట మెట్ పల్లి టౌన్, మండల్ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతు దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కెసిఆర్, దాన్ని అమలు చేయకుండా రైతులను మోసం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేపట్టిన ధరణి పోర్టల్ లో ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని, రైతులకు నిరాటకంగా విద్యుత్‌నందించి పంటలను కాపాడాలని, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం తెలంగాణలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల, పట్టణ అధ్యక్షులు మారు జనార్దన్ రెడ్డి, జెట్టి రూపేష్, అధ్యక్షుడు బొడ్ల రమేష్, కొమ్ముల రాజు పాల్ రెడ్డి,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంబారి ప్రభాకర్,సుఖేందర్ గౌడ్, ఇల్లెందుల శ్రీనివాస్, కుంటుక సదాశివ్, సురభి నవీన్ కుమార్, జేఎన్ సునీత వెంకట్, ధోనికల నవీన్, యాదగిరి బాబు, బీజేవైఎం,బిజెపి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐలకు ప్రశంస పత్రం అందజేస్తున్న కమిషనర్



మంథని,మార్చి 10 మనం న్యూస్ : రామగుండం కమిషనరేట్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్‌లకు సంబంధించి ఎంటిపిసి మిలీనియం హాల్లో రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ రెమ రాజేశ్వరి శుక్రవారం బెస్ట్ వర్టికల్ ఫంక్షనింగ్ రివార్డు మేలను నిర్వహించారు. ఇందులో భాగంగా మంథని ,రామగిరి పోలీస్ స్టేషన్ ల నుంచి ఉత్తమ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఫంక్షనల్ వర్టికల్ విభాగంలో మంథని,రామగిరి ఎస్ఐలు వెంకటేశ్వర్,రవిప్రసాద్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ రెమ రాజేశ్వరి,ఎస్ఐ లకు ప్రశంస పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖ అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయి

### మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ



మంథని,మార్చి 10 మనం న్యూస్ : మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన క్రీడా ,సాంస్కృతిక వార్షికోత్సవ వేడుకల్లో మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు సాంస్కృతి కార్యక్రమాల్లో పాల్గొనడం మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. విద్యారిని,విద్యార్థుల దైనందిన జీవితంలో క్రీడలు ఒక భాగంగా అలవర్చుకోవాలని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆమె విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది,విద్యార్థులని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్లెక్సీలు తొలగించడం పిరికిపందల చర్య



చిగురుమామిడి-మార్చి10 మనం న్యూస్: మండలంలోని చిన్న ములకనూరు గ్రామంలో వృక్షప్రసాద దాత బిజెపి నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జేఎస్ఆర్ అన్న చలివేంద్రం వద్ద ఉన్న ప్రధానమంత్రిమోడీ, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ల ప్లెక్సీలను తొలగించడం పిరికిపందల చర్య అని మండల పార్టీ అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మినారాయణ అన్నారు. బిఆర్ఎస్ నాయకులు చిల్లర మల్లరరాజకీయాలు మానుకోవాలని బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి హెచ్చరించారు. ప్రజలకు సేవ చేసే కార్యక్రమాన్నిఅడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## ఇసుక రవాణా ఆపాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

చిగురుమామిడి- మార్చి10 మనం న్యూస్: మండలంలోని నవాబుపేట గ్రామంలోని ఎల్లమ్మగడ్డ వాగు నుండి ఇసుక తీయకుండా అనుమతులు రద్దు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతులు పిల్లి తిరుపతి, గుల్ల రాజు,బుర్ర శ్రీనివాస్,బోయిని వంశీకష్ణ లు శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్.వి కర్ణన్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వాగు పరివాహక ప్రాంతంలోని రైతులకు ఒక ఎకరం మొదలుకొని ఐదు ఎకరాల లోపు భూమి గల వారు మాత్రమేనని ,వారి వత్తి వ్యవసాయం అయినందున వాగులో ఇసుక తోడితే భూగర్భజలాలు అడుగంటి రాబోయే కాలంలో నీటి కరువు ఏర్పడి పంటలు పండవని అన్నారు. దాదాపు దశాబ్ధకాలం తరువాత వాగులు వంకలు పొర్లి రెండుసంవత్సరాలు పాటు భూగర్భజలాలకు డోకాలేదని అనుకుంటున్న సమయంలో ఇసుక తోడేళ్ల లా అకత్యాలతో వ్యవసాయం మూలన పడే పరిస్థితి దాపురించిందని అన్నారు.

## హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సహాయం



కరీంనగర్, మార్చి 10 (మనం న్యూస్): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ వివిధ కారణాలతో మృతి చెందిన హోంగార్డుల కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని శుక్రవారం పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు అందించారు. 2019లో మృతి చెందిన సంజీవ్, 2021లో మృతి చెందిన హుజురాబాద్ మండలం తుమ్మనపల్లికి గ్రామానికి చెందిన శంకర్ కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హోంగార్డుల విభాగం ఆర్ఎస్ఐ ఎస్.మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న దుద్దిళ్ళ శ్రీను బాబు



మంథని,మార్చి 10 మనం న్యూస్ : మంథని మండలంలోని పలు గ్రామాలలోని వివాహ,కర్ణ వేదనముల కార్యక్రమాలల్లో దుద్దిల్ల శ్రీనుబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలింత మృతికి వైద్య సిబ్బంది

# నిర్లక్ష్యమే కారణమా..?

### సరైన సమాచారం అందించకనే మృతి చెందిందని భర్త ఆరోపణ






కోనరావుపేట, మార్చి 10 (మనం న్యూస్)ః కోనరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బాలింతతో పాటు శిశువు మృతి చెందిన ఘటనలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామం అహ్మద్‌హుస్సేన్ పల్లికి చెందిన సుమలత గురువారం ఆస్పత్రిలో మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో వైద్య సిబ్బంది సరైన సమయంలో సలహాలు ఒదించకపోవడం, గర్భిణీకి, ఆమె బంధువులకు అవగాహన కల్పించకపోవడంతోనే మరణం సంభవించిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సదరు మహిళ గర్భవతి అయినప్పటి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే ప్రతి నెల పరీక్షలు నిర్వహించుకున్న సమయంలో మహిళ పరిస్థితిని తెలియపరచని వైద్య సిబ్బంది ఆమె మరణించిన అనంతరం రక్తహీనత అని పేర్కొంటున్నారని మృతురాలి భర్త ఉల్లెందుల మధుకర్ పేర్కొంటున్నారు. పరీక్షలు నిర్వహించిన సందర్భంలో అంతా సవ్యంగా ఉందని పేర్కొన్న వైద్యాధికారి, ఎఎన్ఎంలు తమకు రక్తపరీక్షల నివేదికలు కూడా అందించలేదన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ఉన్న మహిళల పట్ల ప్రత్యేక దృష్టి సారించాల్సిన వైద్యులు, సిబ్బంది పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, గ్రామానికి చెందిన ఎఎన్ఎం కూడా తన భార్య గురించి ఏనాడూ పట్టించుకోలేదని ఆయన ఆరోపించారు. కడుపులోనే శిశువు మరణించారని పేర్కొంటూ ఆపరేషన్ చేసిన వైద్యులు, మృత శిశువును బయటకు తీసి, తన భార్య ప్రాణాన్ని కూడా బలిగొన్నారని రోధించాడు. మండల వైద్య సిబ్బంది నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని, తాను తన ఇద్దరు పిల్లలు దిక్కులేని వారమయ్యామని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గర్భిణీలు, బాలింతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరాడు. ఇదే విషయమై కోనరావుపేట మండల వైద్యాధికారి వేణుమాధవ్ ను వివరణ కోరగా తన దగ్గరికి చెకప్ కు వచ్చిన సమయంలో ఐదున్నర గ్రాములు రక్తం మాత్రమే ఉందని అది చూసి తాను మందులు రాసి, జిల్లా ప్రధాన ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించానన్నారు. తదుపరి ఏఎన్ఎం ఎలాంటి సలహాలు సూచనలు చేసిందో తనకు తెలియదని పేర్కొన్నారు.

## పురుషుల సంఘం సామూహిక నిధి అందజేత



సైదాపూర్, మార్చి 10 (మనం న్యూస్)ః సైదాపూర్ మండలం పురుషుల పొదుపు సమితి పరిధిలోని వెన్కేపల్లి పురుషుల పొదుపు సంఘ సభ్యులు మునిపాల నరసయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య లక్ష్మికి సామూహిక నిధి 65వేల848 రూపాయలను సమితి అధ్యక్షులు జెల్ల శ్రీనివాస్, సంఘం అధ్యక్షులు ఆలేటి శ్రీనివాస్‌లు శుక్రవారం అందించారు. ఈ కార్యక్రమంలో సైదాపూర్ సంఘ అధ్యక్షులు పైడిపల్లి రవీందర్, ఉపాధ్యక్షులు అయినాల హనుమంతు, పాలకవర్గం వెల్దిరాజు, పూదరి నారాయణ, గడ్డం అశోక్, అందె మహేందర్ రావు, అయినాల రాజు, దొంత శ్రీను, కొండ వెంకటేశ్వర్లు, ఆలేటి రామయ్య, గుంటి స్వామి, దొంత కిరణ్ రాజు, ఘనకులు అనగొని వీరన్న, సంఘ ఘనకులు గుర్రం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాటి చెట్టు పైనుంచి పడి

## గీత కార్మికుడికి గాయాలు



జమ్మికుంట రూరల్, మార్చి 10 (మనం న్యూస్)ః జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి రాజు అనే గీత కార్మికుడు శుక్రవారం ఉదయం తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీన్ని గమనించిన తోటి గీత కార్మికులు ఆయనను చికిత్స కోసం జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయాల పాలైన నిరుపేద కుటుంబానికి చెందిన గీత కార్మికుడు పైడిపల్లి రాజును ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షులు కొండపాక రమేష్ గౌడ్, గౌడ కులస్తులు కోరుతున్నారు.

## రైతులకు రుణ మాఫీ చేయాలని బిజెపి ధర్నా



ఇల్లంతకుంట, మార్చి 10 (మనం న్యూస్)ః రాష్ట్రంలోని రైతులకు లక్ష రూపాయల మేరకు రుణ మాఫీ చేస్తానని హామీనిచ్చిన కెసిఆర్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బెంద్రం తిరుపతిరెడ్డి, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు ఇట్టిరెడ్డి లక్ష్మారెడ్డి, బిజెపి నాయకులు రొండ్ల మధుసూదన్ రెడ్డి, బండారి రాజు, దేశెట్టి శ్రీనివాస్, మామిడి హరీష్, పున్ని సంపత్, పున్ని రాజు, కృష్ణ, శ్రీనివాస్, తిరుపతి, మహేందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

### బిఆర్ఎస్ దళిత సంఘం ఆధ్వర్యంలో..

### కెసిఆర్, రసమయి చిత్రపటాలకు పాలాభిషేకం



తిమ్మాపూర్, మార్చి 10 (మనం న్యూస్)ః హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఆయన జయంతి రోజున ఆవిష్కరించనున్నట్లు కేబినెట్ తీర్మాణించడాన్ని హర్షిస్తూ కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ దళిత సంఘ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం సిఎం కెసిఆర్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళితుల కుటుంబాల్లో స్ఫూర్తి నింపడానికి ఆ మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పి ఆయనకు సంబంధించిన విశేష సమాచారాన్ని మ్యూజియంలో ఏర్పాటు చేసి ఆయన భావ జాలాన్ని అందరికీ తెలిసే విధంగా నిర్మిస్తున్న విగ్రహం నవ చైతన్యానికి నాంది పలుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ దళిత సంఘ సీనియర్ నాయకులు, సర్పంచ్ బోయిని కొమురయ్య, నగునూరి బాబు, వంతడుపుల సంపత్, కోయడ మురళి, గంగిపెల్లి సంపత్, పారునంది జలపతి, దుర్గం అశోక్, తూర్పాటి అజయ్, గాజా సాగర్, రోడ్డ రమేష్, అలువాల సంపత్, తాటిపెల్లి సంపత్, కిన్నెర అంజి, డప్పు తిరుపతి, కామేర ప్రభాకర్, సముద్రాల అనందం, ఎల్కపెల్లి లక్ష్మణ్, ఉప్పులేటి శంకర్, తాళ్లపల్లి నంద కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

### మృతుని కళ్ళు దానం చేసిన కుటుంబ సభ్యులు



తిమ్మాపూర్, మార్చి 10 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీకి చెందిన నీటి పారుదల శాఖ ఉద్యోగి వడాల సత్యనారాయణ రెడ్డి గురు వారం సాయంత్రం హనుమకొండ జిల్లాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విధులు ముగించుకొని కరీంనగర్ వైపుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎర్రగట్టు గుట్ట వద్ద వెనుక నుండి డిసిఎం వ్యాన్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందా డు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యు లు ఆయన కళ్లను రామాయమ్మ ఇంటర్నేషనల్ ఐ బ్యాంక్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ ప్రతి నిధులకు ఆయన కళ్ళను దానం చేశారు. పుట్టె డు దుఃఖాన్ని దిగమింగి, ఇతరులకు కంటి చూపునందించేందుకు మృతుని కండ్లను దానం చేసిన కుటుంబ సభ్యులను గ్రామస్తులు, పలువురు అభినందించారు. శుక్రవారం ఆయన అంత్య క్రియలు రామకృష్ణ కాలనీలో జరగగా తోటి ఉద్యోగ స్తులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## జలపతి రెడ్డి కుటుంబానికి రేవంత్ రెడ్డి పరామర్శ



జగిత్యాల, మార్చి 10 (మనం న్యూస్): ఇద్దరు కూతుర్లతో సహా ఆత్మహత్య చేసుకున్న జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన జలపతి రెడ్డి కుటుంబాన్ని టిపిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దేవేందర్ రెడ్డి, గిరి నాగభూషణం, గాజంగి నందయ్య, జున్ను రాజేందర్, గౌతమ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సలీమ్, గంగారెడ్డి, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకులవి మతి భ్రమించిన మాటలు

## గంగులకు చార్జిషీటు కాదు..
## ఆయన చేసిన అభివృద్ధికి అవార్డునివ్వాలి
## కరీంనగర్ మేయర్ సునీల్ రావు



కరీంనగర్, మార్చి 10 (మనం న్యూస్): కరీంనగర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కాంగ్రెస్ నాయకులు మతి భ్రమించిన వ్యాఖ్యలు చేశారని కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్ రావు విమర్శించారు. కెసిఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు దూసుకువెళ్తూ, దేశంలోనే ప్రత్యేకతను సాధించిందని, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ప్రజలు రాష్ట్రంలో జరుగుతోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. ఇవేమీ కళ్లకు కనిపించని కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు అర్థం లేని వ్యాఖ్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్ర పాలకుల మోచేతి నీళ్లు తాగి, స్వప్రయోజనాల కోసం తెలంగాణ ప్రాంతానికి తీరని ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్ నాయకులదని విమర్శించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం కెసిఆర్ చేసిన పోరాటం, ఇప్పుడు బంగారు తెలంగాణ కోసం ఆయన చేస్తోన్న కృషి ప్రజలకు తెలుసని, కాంగ్రెస్ నాయకుల తీరు, వారి కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. తుపాకులు పట్టుకుని తిరిగే రేవంత్ రెడ్డికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే నైతికత లేదని సునీల్‌రావు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలోనే తెలంగాణ ప్రాంతానికి తీరని నష్టం కలిగించిందని, రాష్ట్ర అభివృద్ధిని వెనక్కు నెట్టిందన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రకటనలో కాంగ్రెస్ పార్టీ చేసిన జాప్యం వల్లనే అనేక మంది ప్రాణాలు అర్పించారని ఆయన ఆరోపించారు. 12వందల మంది అమరవీరుల ప్రాణాలను బలిగొన్న కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది తామే అని ప్రకటించుకోవడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హయాంలో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ప్రజలను మభ్య పెట్టి మిడ్ మానేరు ప్రాజెక్టు మట్టి పనులు చేసి, ప్రాణహిత చేవేళ్ళ ప్రాజెక్టు పనుల కాంట్రాక్టులతో అడ్వాన్సుల పేరిట వందల కోట్ల రూపాయలు అవినీతి చేసింది కాంగ్రెస్ పార్టీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. ఆనాడు మంత్రులుగా పనిచేసిన జీవన్ రెడ్డి, శ్రీధర్ బాబు, ఎంపిగా పని చేసి పొన్నం ప్రభాకర్ దీనికి భాధ్యత వహించాలన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే మిడ్ మానేరు ప్రాజెక్టు పూర్తైంది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి, కిరణ్ కుమార్ రెడ్డి ఇచ్చిన చిల్లర పనులకు ఆశపడి నోరు మెదపకుండ కూర్చున్నది కాంగ్రెస్ పార్టీ నాయకులని నిప్పులు చెరిగారు. జీవన్ రెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ కరీంనగర్ అభివృద్ధి కోసం చేసిందేమి లేదని, శ్రీధర్ బాబు మంత్రిగా ఉండి ఎల్లంపల్లి ప్రాజెక్టు కు తండ్రి పేరు పెట్టి, కరీంనగర్ బస్టాండ్ చౌరస్తాలో తండ్రి విగ్రహం ఏర్పాటు చేశారు తప్పా జిల్లా అభివృద్ధి కోసం ఈ నాయకులు ఒరగబెట్టింది ఏమీ లేదని సునీల్ రావు విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్ కు చార్జ్ షీట్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి లాంటి నాయకులు మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. చార్జ్ షీట్ అంటే తెలియని రేవంత్ రెడ్డి దాని గురించి మాట్లాడటం చాలా విడ్డూరమన్నారు. కరీంనగర్ అభివృద్ధి విషయంలో మంత్రి గంగుల కమలాకర్ కు ఇవ్వాల్సింది చార్జ్ షీట్ కాదని, అవార్డు ఇవ్వాలని ఆ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు. జిల్లాలో నిర్మాణం చేసిన విశ్రాంతి భవనం చూస్తే చాలని అదే కరీంనగర్ అభివృద్ధి కి నిదర్శనమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీ పాలిత ప్రాంతాల్లో ఉన్నాయా స్పష్టం చేయాలన్నారు. ఆనాడు వినోద్ కుమార్ ప్రతి పార్టీ నాయకుల ఇంటి గడప తొక్కి ప్రత్యేక తెలంగాణ కోసం కృషి చేసిన గొప్పనాయకులన్నారు. పార్లమెంటులో పెపర్ స్ప్రే కొట్టగానే ఫ్లెక్సీలు కట్టుకొని తెలంగాణ చౌక్ పొటోల కోసం ఫోజులు కొట్టిన చరిత్ర పొన్నం ప్రభాకర్ దని విమర్శించారు. వీరి ఇద్దరి మధ్య నక్కకు నాక లోకానికి ఉన్న తేడా ఉందని ఎద్దేవ చేశారు. బిఆర్ఎస్ పార్టీ పై గంగుల కమలాకర్, వినోద కుమార్ ల పై విమర్శ లు చేసే నైతిక హక్కు రేవంత్ రెడ్డి కి గాని కాంగ్రెస్ పార్టీ నాయకులకు గానీ లేదని నిప్పులు చెరిగారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు నమ్మరని, మరో సారి తెలంగాణ రాష్ట్రం లో బిఆర్ఎస్ పార్టీ అధికారం లోకి రావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

## భావి భారత పౌరులను అందించేవి విద్యాలయాలే
## మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య



జమ్మికుంట, మార్చి 10 (మనం న్యూస్): నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, వారిని విద్యాలయాలు చిన్ననాటి నుండి దేశ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా తయారు చేసేందుకు ఎంతో దోహదం చేస్తాయని మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య అన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట సెయింట్ థామస్ పాఠశాలలో ఏర్పాటుచేసిన స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి గురువులు ,పెద్దలపట్ల భక్తి గౌరవంతో ఉంటూ మంచి విద్యాబుద్ధులను అలవర్చుకొని వారి బాల్యాన్ని ఆనందంగా గడపాలన్నారు. విద్యతో పాటు చిన్నారులు చిన్ననాటి నుండే క్రీడలు ,సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని అన్ని రంగాలలో రాణించాలని విద్యార్థులకు సూచించారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లు వాడకుండా ఉండడం ద్వారా చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత ఉద్యోగాలు సాధించి భారతదేశం అభివృద్ధి కొరకు పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమానంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్‌ను పాఠశాల యాజమాన్యం శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ శరణ్ తేజ, ఉపాధ్యాయులు కరుణ, రజిత, సంధ్యా రాణి, శ్రవణ్ కుమార్ విద్యార్థిని, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## వీవింగ్ పార్కును సందర్శించిన కోడం రమణ



రాజన్న సిరిసిల్ల, మార్చి 10, (మనం న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా పెద్దూరు శివారులో ప్రభుత్వం నిర్మిస్తున్న వీవింగ్ పార్కును శుక్రవారం సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సిరిసిల్ల లో పవర్ లూమ్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పించడంలో భాగంగా ప్రతి కార్మికునికి 4 సాంచేలు అందించి వర్క్ షెడ్ ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించిన ఫలితంగా ప్రభుత్వం పెద్దూరు శివారులో 88 ఎకరాల స్థలాన్ని కేటాయించిదన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం ముఖ్యమంత్రిగా చేతుల మీదుగా శంకుస్థాపన చేసి మొదటి విడతగా 1104 మంది కార్మికులకు ఒక్కొక్కరికి నాలుగు పవర్లూమ్స్ చొప్పున మొత్తం 4416 పవర్ లూమ్స్ , 60 మంది వార్పిన్ కార్మికులకు 60 వార్పిన్ మిషన్లను అందించాలనే లక్ష్యంతో దాదాపు 370 పైచిలుకు కోట్ల రూపాయలు కేటాయించి వీవింగ్ పార్కు , వర్క్ షెడ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. ప్రస్తుతం వర్క్ షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరుకోవడం జరిగిందని, అందువల్ల అర్హులైన కార్మికులను ఎంపిక చేయడం కోసం ఈ మధ్యనే ప్రభుత్వం చేనేత జౌళి శాఖ అధికారుల ద్వారా రెండు దఫాలుగా సమావేశాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. త్వరలోనే అర్హులైన కార్మికులను ఎంపిక చేయడం కోసం ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. కావున సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మార్చి 12వ ఆదివారం రోజున పెద్దూరు శివారులో నిర్మిస్తున్న వీవింగ్ పార్కు , వర్క్ షెడ్ లను సందర్శించే కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్లతో పాటుగా తంగళ్ళపల్లి, చంద్రంపేట, రాజీవ్ నగర్, టెక్స్టైల్ పార్క్ లలో పనిచేస్తున్న పవర్లూమ్ కార్మికులు, వార్పిన్ కార్మికులు అందరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు.

## వైభవంగా నల్లగొండ
## శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర



తిమ్మాపూర్, మార్చి10 (మనం న్యూస్): కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలోని శ్రీ సీతారామ లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జరిగిన జాతర రథోత్సవ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పొల్సాని సుగుణాకర్ రావు, కరీంనగర్ రూరల్ ఏసిపి కరుణాకర్ రావు, తిమ్మాపూర్ సిఐ రమేష్ లతో పాటు ప్రజా ప్రతినిధులు, పోలీస్ అధికారులు, వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించుకున్నారు.

## నిధులు మంజూరు చేయాలని ఎంపికి వినతి



గంభీరావుపేట, మార్చి 10 (మనం న్యూస్): గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు నాయకులు శుక్రవారం కరీంనగర్ ఎంపి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. నిధుల విషయంలో ఎంపి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గణేష్ రెడ్డి, పరశురామ్ గౌడ్, వంగ రాజిరెడ్డి, గుండారం రాము, బొల్లారపు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన

**: బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు సంపత్ రావు**

**- రైతుల సమస్యలు పరిష్కరించాలని బిజెపి ధర్నా**

జమ్మికుంట, మార్చి 10 (మనం న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో రైతు వ్యతిరేక పాలన సాగుతోందని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్ రావు విమర్శించారు. శుక్రవారం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతాంగ సమస్యలను పరిష్కరించాలన డిమాండ్ చేస్తూ స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంపత్ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతంగానికి లక్ష రూపాయల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని చెప్పిన కెసిఆర్ ప్రభుత్వం నేటి వరకు రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందని మండిపడ్డారు. రైతులకు రుణమాఫీ చేయని కారణంగా బ్యాంకులలో రైతుల ఖాతాలు డిఫాల్టర్ గా మారిందని, దీని వల్ల వారి కుటుంబ సభ్యుల ఉన్నత చదువుల కోసం బ్యాంకు రుణాలివ్వడం లేదన్నారు. దీనివల్ల రైతుల కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువులు చదువుకోడానికి ఇబ్బందిగా మారిందని ఆయన తెలిపారు. రైతుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి లేని కెసిఆర్ తీరు వల్లనే అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సంపత్‌రావు ఆరోపించారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీ మేరకు లక్ష రూపాయలు, వాటికి సంబంధించిన వడ్డీని కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇస్తున్నామని చెప్పి నిండు అసెంబ్లీలో కేసీఆర్ అబద్ధాలు చెప్పడం దుర్మార్గమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా 24 గంటల కరెంటు రావడం లేదని, ఇది తెలియాలంటే కెసిఆర్ ఫామ్ హౌస్ వదిలి ప్రజల్లోకి రావాలని సూచించారు.




ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతులకు వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక తీసుకుని, రైతుల భూ సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి తెచ్చిన ధరణి పోర్టల్ ఈరోజు రైతులకు శాపంగా మారిందని సంపత్ రావు ఆరోపించారు. పదుల సంవత్సరాలుగా భూములు దున్నుకుంటున్న నిరుపేద కుటుంబాలు ధరణి పోర్టల్ కారణంగా భూములు కోల్పోయే ప్రమాదం ఉందని వాపోయారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ తీసుకొని ధరణి పోర్టల్ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నరేంద్ర మోడీ గారి ప్రభుత్వం రైతులకు అండగా ఉండడం కోసం తీసుకొచ్చిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయకుండ కెసిఆర్ ప్రభుత్వం అడ్డుకుంటుందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఫసల్ బీమా పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ శాఖ అధ్యక్షుడు జీడి మల్లేష్, ఉడుగుల రవి కుమార్ ,గిరివేణి ఐలయ్య, పల్లపు రవి, ఇటుకల సరూప, మోతే స్వామి, ఠాగూర్ రాజేష్, మోడం రాజు,ఠాగూర్ రాకేష్, భీమిరి కిషన్ రావు, బూరుగుపల్లి రామ్, శనిగరపు రవి, గర్రెపల్లి నిరుప రాణి తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై

# నిషేదాజ్ఞలు పొడిగింపు

## సిపి సుబ్బారాయుడు

కరీంనగర్ బ్యూరో, మార్చి 10 (మనం న్యూస్): సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31వరకు పొడిగిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్.సుబ్బారాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుండటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని తెలిపారు. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని సిపి తెలిపారు. ఐపిసి 188 హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

### డిజెలపై నిషేధాజ్ఞలు పొడిగింపు

కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో డిజె సౌండ్ వినియోగంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగిస్తున్నట్లు సిపి తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా శబ్దకాలుష్యం నుండి కాపాడేందుకు భారీ సౌండ్లతో కూడిన డిజె సౌండ్ వినియోగంపై నిషేదాజ్ఞలు విధించినట్లు పేర్కొన్నారు. వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ ల వినియోగం తప్పనిసరి అనిపిస్తే సంబంధిత డివిజన్ ఎసిపిల అనుమతి పొందాలని సూచించారు. ఏ ఏ ప్రాంతాల్లో ఏమేరకు ఏ స్థాయిలో మైక్ సెట్లు వినియోగించాలో పరిమితులున్నాయని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ఇప్పటి వరకు డిజెల వినియోగంపై యజమానులకు అవగాహన కల్పించడం జరిగిందని, పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని తెలిపారు. నిషేదాజ్ఞలు ఉల్లఘించే వారిపై ఐపిసి 188, హైదరాబాద్ నగర పోలీసుచట్టం, ఫసలి నిబంధనలనుసరించి చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సిపి హెచ్చరించారు.


మనం కావలెను
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక

'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.

కావలసిన ప్రాంతాలు :

కరీంనగర్ జిల్లా : కరీంనగర్ క్రైమ్, గంగాధర, గన్నేరువరం, మానకొండూర్ రూరల్.
జగిత్యాల జిల్లా : జగిత్యాల టౌన్, జగిత్యాల రూరల్, ఎడ్యుకేషన్, ధర్మార్ క్యాంపు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం, కథలాపూర్, సారంగాపూర్, గొల్లపల్లి, మల్యాల, ఎండపల్లి.
రాజన్న సిరిసిల్ల జిల్లా : సిరిసిల్ల క్రైమ్, సిరిసిల్ల ఆర్.సి., రుద్రంగి, చందుర్తి, వేములవాడ టౌన్, వేములవాడ రూరల్, వేములవాడ ఆర్.సి., ముస్తాబాద్.
పెద్దపల్లి జిల్లా : పెద్దపల్లి / ఆర్.సి., టౌన్, రూరల్, రామగుండం, కోల్‌సిటీ, జూలపల్లి, ఓదెల, పాలకుర్తి, అంతర్గాం, 8ఇన్ క్లైయిన్ కాలని, బసంత్‌నగర్.

మనం జనం కోసం... అక్షర యజ్ఞం... తెలుగు దినపత్రిక
ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యాలయం
ఇ.నెం. 1-6-169, మమత థియేటర్ ప్రక్కన,
కలెక్టరేట్ రోడ్, భగత్‌నగర్, కరీంనగర్.
కె. తిరుపతి రెడ్డి
బ్యూరో ఇంచార్జ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా
సెల్ : 83339 98076